౧ "అసత్రఖడ్గసహాయనిమిత్తే…!"

భావరాజు వేంకటకృష్ణరావు

[ఇది చారిత్రాత్మకమైన కథ. ఇందలి ప్రధాన పాత్రలు చారిత్రకమహాపురుషులు. కథావస్తువునందు కల్పన యెంతకలదో, చరిత్రకూడ నంతేకలదు. ఇది వేయేండ్లకు ముందునాటిమాట. నాఁడెట్లు జరిగెనో చూచి వచ్చినట్లు వర్ణించుట కేవలము అసాధ్యమైనపని. అట్టి దానిని పూనుకొనుట నిక్కముగ సాహస మనిపించుకొనును. అయినను సహృదయ పాఠకలోకముయొక్క ఆదరమును అపేక్షింతును.

అఖిలాంధ్రదేశమును పాలించిన చాళుక్యనృపాలురలో గుణగవిజయాదిత్యుఁడు అందరికంటె కడుప్రసిద్ధుఁడు. ఆతనికాలమున చాళుక్యవంశమునకు కులవైరులగు రాష్ట్రకూటులు పెక్కుమారు లోడింపబడి, భంగపాటునొందిరి. అప్పుడొకసారి రాష్ట్రకూటులరాజధాని, మాన్యఖేటము, ఆంధ్రాధీశునిచే నుగ్రకోపమున విధ్వస్తము గావింపబడెను రాష్ట్రకూట రెండవకృష్ణరాజు చేతులు ముకుళించుకొని వచ్చి, వినమ్రుడై వేడుకొని, గుణగవిజయాదిత్యునివలన నపహృతరాజ్యమును మరల ప్రతిగ్రహించెను. రాష్ట్రకూటులకు చాళుక్యులతో సంబంధబాంధవ్యములుండెను. కృష్ణరాజు విజయాదిత్యునికి మేనమఱఁది, విజయాదిత్యుని తల్లి శీలమహాదేవి కృష్ణరాజునకు మేనత్త

కృష్ణవల్లభునికి తోడువచ్చిన పాండ్య, కోసల కళింగభూమిపతులుగూడ పరాజితులై, కానుకలను, అప్పనములను అర్పించి, ౨ వేంగీశ్వరుని యనుగ్రహమును సంపాదించుకొనిరి. కోసలేంద్రునకు, రెండవకృష్ణరాజు దగ్గరచుట్టము, కళింగాధీశునకును వేంగీమహీవల్లభునకును మొదటినుండియు బద్ధవైరమే! కాళింగగాంగరాజులు ఆంధ్రభూపాలుర నెదిరించి నిగ్రహింపజాలక యెల్లప్పుడును లోలోన కుములుచుండిరి. పటుసాహస విక్రమాఢ్యుడైన గుణగవిజయాదిత్యుడు బ్రతికియున్నంత కాలము, ఆతని శత్రువులెవ్వరునుగూడ నాంధ్రమహాసామ్రాజ్యముపై కన్నెత్తి చూడజాలకపోయిరి. ఒకనాడు విజయాదిత్యుఁడు, పినాకినీ నర్మదామధ్యస్థమైన అఖిలదక్షిణాపథమును చక్రవర్తి పదవితో, నేకచ్ఛత్రాధిపత్యముగ నేలెను.

ఆతడు నలువది నాలుగేండ్లు, క్రీ. శ. ౮౪౮ మొదలుకొని ౮౯౨ వఱకు పరిపాలించెను. ఆతని యవసానకాలమున నాతని తమ్ముడైన యువరాజ విక్రమాదిత్యుని కుమారుఁడు చాళుక్యభీముడు రాజ్యాభిషిక్తుడు కాకుండ, దాయాదులును వైరిరాజులును వేయిపన్నాగముల బన్నిరి. పినతండ్రి మల్లరాజొకవంకను, మేనమామయగు కృష్ణవల్లభుడొకవంకను, క్రేటువడిన త్రాచులవలె పగబూని కోసలకళింగభూధవులసాయము గొనివచ్చి చాళుక్యభీముని పట్టాభిషేకమునకు విపర్యయము గలిగింపదొడఁగి, పూర్ణముగ విఫలమనోరథులైరి.

పిమ్మటవారు నల్దెసలనుండివచ్చి, యాంధ్రదేశముపై బడి, చాళుక్యభీముని పదచ్యుతిని జేయ దలపడిరి. అపుడాంధ్రదేశమునందు ముఖ్యముగ వేంగీవిషయము ఘోరసంగ్రామరంగముగ బరిణమించెను అట్లు నిరంతరయుద్ధములతో మూడేండ్లు వరుసగా గడచిపోయెను. తుదకు రాష్ట్రకూటబలములనెల్ల ఖండించి, దాయాదకులద్రోహులనందఱిని దేశమునుండి పాఱద్రోలి శత్రునిర్మూలనము గావించి, రాజచాళుక్యభీముఁడు. 'సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధనమహారాజాధిరాజు' అను అభిషిక్తనామముతో ముప్పదియేండ్లు, అరిరాజభయంకరుఁడై, నిజప్రజానురంజకముగ, సుస్థిరైశ్వర్యముతో నీయావదాంధ్ర

౧ ఈపదము చాళుక్యభీముని పండిపాకతామ్రశాసనములోనిది.

౨ "వేంగి," "ఆంధ్ర" అను నీరెండుపదములును పూర్వకాలమున పర్యాయపదములగా వాడఁబడెను.

భూమిని సంరక్షించెను. ఆతడుకూడ గుణగవిజయా దిత్యునివంటి పరాక్రమశాలి, చక్రవర్తిపదవితో భూచక్రము నేలినవాడు. ఆతనిపట్టాభిషేకము జరిగినమూడవ యేటినాటిది అనగా, క్రీ. శ. ౮౯౫-వ సంవత్సరము నాటి దీకథలోని వృత్తాంతము. —భా. వేం. కృ.]

౧

గుణగాంకవిజయాదిత్యుని చమూపతు లైన బ్రాహ్మణయోధవీరులలో వాజసనేయబ్రహ్మచారి విద్దశర్మ కడుసుప్రసిద్ధుడు. ఆతడు ద్రోణాచార్యునివంటి పరాక్రమముగలవాడు. ధనుర్విద్యాపారంగతుడు. బలయుతబలదేవతుల్యుడు. శతానేకసమర సంఘట్టములందు శౌర్యమూర్తియై వెలిగి ప్రభువునకు సర్వదా జయముగూర్చిన మేటివీరఘనుడు. ఇపుడాతడు వృద్ధుడైనాడు. ఇంచుమించుగా ఎనుబదిసంవత్సరములు వయసుచెల్లినవాడయినను విద్దశర్మ ఏబదిసంవత్సరములు దాటనివానివలె గన్పించును. చిన్ననాటను వేదవేదాంగముల నభ్యసించెను. కులవిద్యతోపాటు పితృపితామహులవలె శస్త్రాస్త్రవిద్యల నభ్యసించి, శస్త్రజీవియై కాలముగడిపి గణుతికెక్కెను. కాని దైవవశమున నాతనిహృదయము దుఃఖభరమున క్రుంగిపోయెను. అంతట నాతడు శస్త్రాస్త్రములను త్యజించి, విరాగియయ్యెను. ఆతడు రేనాటిసీమయందు పంపానదియొడ్డున స్వగ్రామమందు స్వకర్మానుష్ఠానపరుడై, షట్కర్మనిరతుడై తపముజేసికొనుచు జీవయాత్ర గడుపసాగెను.

ధన్యులైన యాతని ముగ్గురు తనయులును చాళుక్యనృపాలుని సైన్యమునందు దండనాయకులై ప్రసిద్ధివడసి, సంగ్రామరంగములందు స్వామికార్యనిర్వహణధూర్వహులై, నిశ్శంకతో ప్రాణము లర్పించి, యశఃకాయులయిరి. ఆవృత్తాంత మిట్లుజరిగియుండెను. జ్యేష్ఠుడైన తూర్కశర్మ మహాసేనాని ప్రభువుపాండురంగడు మన్నించిన మేటివీరఘనుడు. "వెలలేనిబోయ కొట్టములను సాధించువేళ, ప్రభుపాండురంగనిచెంత భీకర గదాయుద్ధముచేయుచు, జయజయధ్వానములు మిన్నుముట్టువేళ తూర్కశర్మ బలువైన కుంతప్రహారమునకు నిష్కారణముగ కూలి, నిజస్వామి నాశీర్వదించుచు అసువులు విడచెను. ఆతడు ఇరువదియైదువర్షముల నూత్నయౌవనప్రాయమున వీరస్వర్గ మలంకరించెను. రెండవవాడు శ్రీధరుడు. సేనాపతియైన వినయడిశర్మ అశ్వసైన్యమునందు సాహిణియై ప్రసిద్ధికెక్కెను. విజయాదిత్యుడానాడు భీకరసంగ్రామ రంగమునందు, మంగిరాజు శిరము ద్రుంచువేళ, హయారూఢ రేవంతుడై ప్రభువుచెంత బోరాడి, తనవిజయకుంతమునకు మంగిరాజుశిరము గ్రుచ్చి వినాదికి ఎత్తి ఆటోపమును జూపుతఱిణమున వైరివీరునికరవాలమునకు గురియై నేలగూలెను. మూడవవాడు సబ్బిశర్మ, అగ్రజులను మించిన మహావీరుడు. అశ్వత్థామతుల్యవిక్రమ సంపన్నుడు. మహాబలశాలి. విజయాదిత్యుడు మాన్యఖేటమును దగ్ధముగావించునాడు గజసాహిణియై, ఏనుగుబలములతో కంచుకోలుపుల బగులగొట్టించినాడు. సుభటనాయకవర్గమును, విక్రమింపజేసి పెద్దగవనిని జొచ్చినాడు. కాని యాకోలాహలమునందు శరాఘాతమునకు వివశుడై యేనుగునుండి జారిపడి మరణించినాడు.

ఇట్లు, ప్రాజ్ఞులై, కీర్తిగన్న మహాయోధవీరులగు ముగ్గురు కుమారులనుగూడ ప్రభుసేవకై దేశక్షేమమునకై, ఆహవరంగమున అర్పించి, నేడు ఆశోపహతుడైనాడు వీరుడు విద్దశర్మ. పొంగిపొరలి వచ్చుచుండిన పుత్రవియోగదుఃఖ భారము నాతడు ఆపుకొనజాలకపోయెను. అప్పటికి విద్దమయ్యకు ఏబదియేండ్లు దాటియుండెను. పుత్రార్థియై యాతడు నారాయణసమర్పణమైన యొకమహామంత్రము నుపదేశముబొంది, యద్దానిని తనయిల్లాలికిగూడ నుపదేశించి, కొంతకాలము నిష్ఠాగరిష్ఠుడై, తపమాచరించెను. శ్రీమన్నారాయణుని కృపవలన, కొన్నినాళ్లకు మనవిద్దశర్మకు, మహనీయతేజముతో వెలుగువాడు, రాజసతామసములు వాటమునొందిన రూపమువాడు, సర్వశుభలక్షణాంకితుడైనవాడు, కుమారుడు, ఒకశుభముహూర్తమున జన్మించెను. రంగేశుని కటాక్షవిశేషమున కలిగిన యాపాపనికి విద్దశర్మ 'రంగాధికకర్కశర్మ' యని నామకరణము చేసెను.

ఏడేండ్లు నిండిననాడు తలితండ్రు లారంగశర్మకు సముచిత ఉపనయనాదికర్మకలాపములు నిర్వర్తించి, వేద వేదాంగవిదుని జేయుటకు, గురుకులవాస మొనర్ప పాక నాటిలోని యార్వుటూరునకు బంపిరి. అత డచ్చట పండ్రెండుసంవత్సరములు బ్రహ్మచర్యము నెఱపెను. రంగశర్మ మహామేధావి; మరియు నేకసంథాగ్రాహి. ఆకారణమున నాతడు, అస్వల్పకాలమున, ద్వివేదియై శాస్త్రజ్ఞుడై, ఘనతకెక్కెను.

బ్రహ్మవిద్యోపాసన చేయుకాలమున నాతడు కులక్రమాగతములైన శస్త్రాస్త్రవిద్యలనుగూడ నభ్యసించెను. విశాలవక్షమును, దీర్ఘము బలిష్ఠములైయున్న బాహువులును, మెఱుపుబోలిన యాకార రేఖయును, రాజస తామసము లేకకాలమున వెలుగొందు మనోహరమైన వదనమును, సౌష్ఠవము నొందినసర్వాంగములునుగల యాతని గాంచినవారు అచ్చెరువందుచు, పలుమారు పరికించుచు, 'భళిరే! ఇత డభినవపరశురాము డన్నట్లున్నాడు!' అనుచు ప్రశంసచేయుచుండిరి.

రంగశర్మ గురుకులమును విడిచివచ్చినపిదప, జనకునికడ కొంతకాలము శుశ్రూష యొనర్చి, అపూర్వములు అమోఘములు నగు శస్త్రాస్త్రవిద్యలను అభ్యసించెను. ఖడ్గ, గదా, కుంత, కోదండ, మల్ల, ముష్టి యుద్ధములందు విశేషకౌశలము సంపాదించి బలునైన వాడని ప్రఖ్యాతి గాంచెను. కరి, తురగాగమములను అభ్యసించెను. చేత ఖడ్గము బూని, హయారూఢరేవంతుడైనపుడు, ఒక్కపెట్టున ఏబదిమందియైన యెదిరింపవచ్చిన పెనగి, చిత్రగతులవారినెల్ల గూల్పగల పటుసాహసవిక్రమాఢ్యుడని పేరుగడించెను.

తనయవసానకాల మాసన్నమైనదని యెఱిగి, విద్దయ్య, గృహస్థుడైనకుమారుని నుద్దేశించి, "వత్సా! ఏనును, నాపితృపితామహులునుగూడ, వీరలక్ష్మినివాసమైన రాజచాళుక్యవంశమును సంరక్షించుటకును, దానినీయాంధ్రదేశమున సుప్రతిష్ఠిము జేయుటకును, శస్త్రోపజీవులమై, సదా మాఖడ్గమును వినియోగించి కృతార్థులమైతిమి. నీఅగ్రజులు మువ్వురును బ్రాహ్మణధర్మముతో పాటు క్షాత్రధర్మము నవలంబించి, మన రాజచాళుక్య కుల కళ్యాణమునకై ప్రాణము లర్పించి, ధన్యులయిరి. నీవుకూడ మహనీయతేజోవిలాసమూర్తివి. శౌర్యఖనివి. కాన, నీపూర్వు లనుసరించి, చనినమార్గమును, నీవుకూడ ననుగమింపవలయునని నాయభిమతము. నీశస్త్రాస్త్ర వివేకమును, బాహుబలమును, బుద్ధిబలమును, విక్రమ పటిమయును, రాజచాళుక్యకుల కళ్యాణపరంపరాభివృద్ధికై వినియోగించి, వాటికి సార్థకత గల్గించుకొమ్ము. చిరయశము నపేక్షించుచున్న నాహృదయము, ప్రభుసేవాయత్తమైన నాచిత్తము నిన్నుకూడ రాజసేవయు, దేశసేవయు నొనర్పుమని యాదేశించుచున్నది. పితృవాక్యపరిపాలన మొనరించి విజయశ్రీసౌఖ్యము లందుకొనుము. నీకు సర్వదాజయమగుగాక" అనుచు దీవన పరంపర లిచ్చెను.

తండ్రియాజ్ఞ యొకవంక చిత్తమును చాళుక్య రాజధానియగు విజయవాడకు లాగుకొనిపోవుచుండ, మరియొకవంక నాముష్మికచింత మనరంగాధికక్క శర్మను, స్వకర్మానుష్ఠానమునకు నిశ్శంకతో దాగితీసెను. కొన్నిమాసములట్లు, ఆతనికి చిత్తసంక్షోభముతో గడచిపోయెను. తుద కాతడు కృతనిశ్చయుడయ్యెను. పైతృకమగు చెఱుకుపన్నస పండ్రెండుపుట్ల ఎత్తుపట్టు క్షేత్రమును దున్నుకొనుచు, స్వకర్మానుష్ఠానపరుడై, గృహస్థాశ్రమమునందుండి, తపము జేసుకొనుచు కాలముపుచ్చసాగెను.

విద్దశర్మ మరణించిన కొన్నిదినములకే గుణగ విజయాదిత్యుడుకూడ దివంగతుడయ్యెను. అతనిచావు, దగ్గఱనున్న ఆప్తజనులకుకంటె దూరమున నున్న దాయాదద్రోహి వైరిభూపతులకు ముందుగా తెలిసెను. సమయమునకై పరితపించుచు వేచియున్న కృష్ణవల్లభుడు చాళుక్యరాజ్యవంశముపై పగదీర్చుకొన నిశ్చయించుకొనెను. తన్నాశ్రయించిన మేనమఱది మల్లరాజును, అక్షణమందు జని, అన్నరాజ్యసీమలను ఆక్రమింపుమని సేనల నాయత్తపఱచి పంపెను. ఆతడు నోలంబరాజసేనాసమేతుడై, దక్షిణమునందుండి యాంధ్రదేశమును జొచ్చి, యావద్దక్షిణసీమలను భస్మీపటలము

గానింతునని ప్రతినబూని, రణభేరి మ్రోయించెను. దక్షిణమున కందుకూరి పురాధీశ్వరుడును పాకనాటికి ప్రభువును కందుకూరి పాలకుడును, బీభత్ససదృశపరాక్రమసంపన్నుడును నగు, మహామండలేశ్వర పాండురంగ భూపాలుడు అపుడు జీవించి లేడు. మున్ను పలుసార్లు ఆ మహావీరుని విక్రమమునకు వెఱచియే కృష్ణరాజు సిగ్గుమాలి యంతవఱకు తలయెత్తుకొనజాలక పోయెను. పరాభవాగ్నిచే దగ్ధమైన కళింగభూపతి మానసక్షేత్రమున, నేడు మరల వేంగీశ్వరుని ఎదురింపగలమను అడియాస గల్పించి, కృష్ణరా జాతని చాళుక్యనృపాలునిచే సురక్షితమైన దక్షిణకళింగమును ఆక్రమింప సన్నాహపఱచెను. ఆతనికి వెనువెంటనుండి సాహాయ్య మొనర్పవలయు ననియు, కయ్యమునకు గదలవలయు ననియు కోసలేంద్రునికి ఆజ్ఞాపించెను. కృష్ణరాజు తా నొక అక్షోహిణీబలముతో చాళుక్యభీముని దర్ప మడపింప విజయవాడపైకి సంగరాటోపమున నడచెను.

౨

విష్ణువర్ధనునకు పట్టాభిషేకమున జలధారలచే దడిసిన శిరోజము లింకను దడియార లేదు. సంతోషస్వాంతులై వచ్చియున్న సామంత, మహామాండలిక రాజలోకమునకు గలిగినయానందమున దనివితీఱ లేదు. అపు డొక నాటి నిశీథమున వేగువా డొకడు, కోరమీసముల వాడు, ఘోరభైరవగదవాడు, ఘనమైన దేహమువాడు, కారునల్లని మేనిఛాయవాడు, భీకరవేషమువాడు తత్తఱపాటుతో చనుదెంచి, రహస్యసాంకేతికముల సహాయమున, హుటాహుటి నంతిపురమున జొచ్చి, భీమభూపతిని మేలుకొలిపి, శత్రువుల సమరసన్నాహముల సన్నిటిని పూసగ్రుచ్చినరీతి విన్నవించి మరల యాజ్ఞగైకొని యథేచ్ఛను బోయెను.

మఱునాడుదయమున పెద్దకొలువు నిలుపవలెనని భీమభూపాలుడు ఆప్తమంత్రివర్గమునకు ఆన తిచ్చెను. ఆతడు స్నానసంధ్యాదికాలోచితకృత్యములు నిర్వర్తించి శుచిపట్టువస్త్రములను కటియందు దాల్చి, తిలకము దీర్చి, పునుగు జవ్వాది కస్తూరిరసమును గలిపినయట్టి శ్రీచందనమును మేన చెలువుగా బూసికొనెను. తగటు కుప్పసములను ధరియించి, తలకు చక్రవర్తిలాంఛనమైన వింతయుష్ణీషమును ఒప్పుగా గట్టి, దానిపై నవరత్నఖచితమైనట్టి పట్టబంధము గట్టెను. నవరత్నహారములు కంఠమున శృంగారముగ ధరియించెను. చెవులకు మణిమయాంచితకుండలములు, బాహువులకు భుజకీర్తులు, ముంజేతులకు మురుగులు గొలుసులు, వ్రేళ్లకు రత్నముద్రికలు పెట్టుకొనెను. నవరత్నఖచితమైన నడికట్టు మొలను దాల్చెను. కాలికి గండపెండేరమును దొడిగెను. బంగారు దుకూలము పైన గప్పుకొనెను. పావుకోళ్లను పాదములందు దొడిగి కొలువుకూటమునకు పయనమయ్యెను.

అంతట బంగారు జలపోతబోసిన వెండిబెత్తముల బట్టుకొను కటికవారు సారెసారెకు బరాబరులు సేయుచుండ, కొందరు వేత్రహస్తులు నిరుకెలంకుల నడచుచు, సందడిమూరమై చనునట్లు హెచ్చరించుచుండిరి. బంగారు గుబ్బతో భాసిల్లుచున్నట్టియు చుట్టును ముత్యాలసరులు వ్రేలాడుచున్నదియు నగు తెల్లపట్టుగొడుగును ఇలయేలికపై పట్టుకుని భటుడు వెనుకనడచెను. పృథ్వీశ్వరులకు ముందు కులక్రమాగతములైన సామ్రాజ్యచిహ్నములను బట్టుకొని భటులు భయభక్తులతో నడచుచుండ సర్వలోకాశ్రయుడు అంతఃపురమునుండి వెడలి కొలువుకూటమున కేతెంచెను.

అతిరమణీయముగ సింగారింపబడిన వేంగీశ్వరుని కొలువుకూటమున వెదజల్లబడిన కర్పూరరజము, పునుగు, జవ్వాజి, కస్తూరిరసములు గలిపిన కలయంపి ఘుమఘుమ తావులు నల్దెసలందు వ్యాపించెను. అం దొకతావున పంచవన్నెలు ముగ్గులువెట్టిరి. దానిపై పంచవన్నెల పటములు పఱచిరి. అం దొక పెద్దపీఠమును నిలిపిరి. దానిపై పంచవర్ణముల రత్నకంబళములనుగప్పి, వాటిపై కాంచన నవరత్నఖచితమైనట్టి సింహపీఠమును దిశలు వెలుగొంద నిలిపిరి. భీమనృపాలుడు డంబుమీర, ముగము జూచినమాత్రమున మూర్ధాభిషిక్తులు మోడ్పుచేతులు ఘటియించు రాజసమూర్తియై తేజరిల్లుచు, భట్టువార లీవలావల జేరి "చాళుక్య కులాబ్ధిసోమ!

సర్వలోకాశ్రయుండ! పరచక్రభీమ! పరగండరాక్షసుండ! విజయీభవ, దిగ్విజయీభవ! మానవ్యసగోత్ర పవిత్ర! భూపాలమేరు! కౌశికీవర ప్రసాదలబ్ధ సుస్థిరైశ్వర్యవిభవ! విక్రమధనంజయ! విజయీభవ! దిగ్విజయీభవ! వనితాభిరామ! దుష్టకాలానలుండ! భువనైకదీప! ఆంధ్రక్ష్మాపాల! రాజమకరధ్వజుండ! అరిరాజభీషణుండ, సౌజన్యనవశ! విజయీభవ! దిగ్విజయీభవ! శౌచకందర్ప! త్యాగమహార్ణవుండ! విష్ణువర్ధనమహారాజాధిరాజ! రాజపరమేశ్వర! విజయీభవ! దిగ్విజయీభవ! అనుచు బిరుదుగద్యలు పఠించుచుండ, నేతెంచి సింహపీఠముపై నధివసించెను.

ఆసార్వభౌముని కొకవైపున పట్టమహిషియు, వరుసగా ముగ్గురు రాజతనయులును కనకపుటాసనములపై సుఖోపవిష్టులైరి. మరియొకవైపున సమస్తసామంతాంతఃపుర, మహామాత్ర, అమాత్య, పురోహిత, శ్రేష్ఠి, సేనాపతి, దేవాంక, శ్రీకరణ, ధర్మాధ్యక్షకాది ఆప్తమంత్రివర్గము సముచితాసనములందు నమ్రతతో నుండిరి. ఆ పృథివీశ్వరునియిరుపార్శ్వములందు దివ్యాంగనలబోలు సుందరులు వెంజామరలు వీచుచుండిరి. ఆ సార్వభౌముని ముంగిట, నందందు, రాజచాళుక్యకుల క్రమాగతములైన శ్వేతాతపత్ర, ఏకమహాశంఖ, పంచమహాశబ్ద, పాలికేతన, ప్రతిఢక్క, వరాహలాంఛన, పింఛ, కుంత, కనకదండ, మకరతోరణ, గంగాయమునాదిసమస్తసామ్రాజ్యచిహ్నములను భటులు పట్టుకొని నెలకొనియుండిరి. అందొకవంక బంధుజను లుండిరి. మరియొకవంక, నిఖిలశాస్త్రపారంగతులు, వేదవిప్రులు, వేశ్యలు, గాయకులు, కవులు, సుభటులు ఎందరెందరో సముచితాసనములందు కొలువుండిరి. ఒకవంక సకల దేశాధీశు లంపించిన సచివపుంగవులు ముకుళితహస్తములతో వినమ్రులైయుండిరి. పట్టమహిషీసమేతుడై మహారాజు కొలువుకూటమున కేతెంచి, సింహపీఠముపై సుఖాసీనుడయినపిదప, వేదశాస్త్రజ్ఞులు, విద్వాంసులు నగు భూసురులు "అఖిలరాజ్యములు వశముచేసికొని యేకాధిపతివగుచు, నేలు మీధారణీస్థలి" యంచు సమ్మోదముతో దీవనలిచ్చి ఆసీనులైరి.

కొలువునందు పూర్వమర్యాదల ననుసరించి, జరుగవలసినవినోదములు ముగిసినపిదప, సర్వలోకాశ్రయుడు, తన్ను పరివేష్టించియున్నవారిని గాంచి, తనకు వేగులవానివలన దెలియవచ్చిన సకలవృత్తాంతము నెఱుకపఱిచెను. పిదప కొన్నిముహూర్తముల కాలము నాప్తులతో ముందుజరుగవలసినకర్జ మాలోచించెను. ఆవల నొకసారి సకలసామంతరాజలోకము నుద్దేశించి ప్రియ మొప్పగా "ఈక్షణము మీరెల్లరు, మీమీరాజ్యముల కరిగి, ప్రస్థానభేరి మ్రోగింపవలయు. మీవారెల్లరు మీపాలెగాండ్రును, బంధువర్గమును, దొరలను, పడవాళ్లను బిలిపించి తక్షణము సంగరమునకై సైనము జెప్పింపవలయు. శౌర్యయుతులైన వీరరాహుత్తులను విలుకాండ్రను, ధృఢవిలుకాండ్రను, దృఢకాయులైన యోధవీరులను, వివిధాయుధసామగ్రితో సన్నాహపఱచి, కదనమునకై వడిగ బిలిపింపవలయు. మీరును, మీవారెల్లరును మారాజవంశముపై గలభక్తి తేటపడునట్లు, మీమీ నియతితో నేతెంచి, మాకు విజయలక్ష్మికై వసమగుదాక బాసటయై నిలువవలయు. ఇది మాయాజ్ఞ" అను ధీరవచనముల పల్కెను. అపుడు వారికందఱికి రమణీయములైనవస్త్రభూషణాదు లిప్పించి, విడియంబు లిప్పించి తరలిపొమ్మని యానతిచ్చెను.

పిదప చాళుక్యభీముడు, అమాత్యవర్గముదెస దృష్టి నిలిపి గంభీరస్వనముతో నెల్లవారలకు వినబడునట్లు "వీరులమని పేరుపెట్టుక బ్రతుకువారికందఱికిది నాయాజ్ఞ! బ్రతుకులపై నాస పాఱద్రోలి, ప్రభుసేవకై, దేశసేవకై వడిగ సంగరాటోపముతో బిరుదుగట్టి, ప్రతిసబ్బాని యాక్షణము యేతేఱవలయు నని, మీ యిలయేలిక రాజచాళుక్యభీము డర్థించుచున్నాడు. పిఱికిప్రేవులు విడిచి, శౌర్యోత్సాహములు మూర్తీభవించినరీతి కదనరంగమునకడలవలయు. కాశగట్టి, కత్తిపట్టిన వానికి పగదీర్చుకొనజాలని పౌరుషముండిన ఫలమేమి యనుచు మీస్వామి యాదేశించుచున్నాడు" అనుచు ప్రకటనము గావింపుడు.

పిమ్మట నొకముహూర్తమాగి, మరల నిట్లని, యానతిచ్చెను. "మాయానతిని విషయమహత్తరజ అయుక్త, నియుక్త, స్థానాధిపతి, అధ్యక్షకాది రాజపురుషులకందఱికి దెలిపి, విస్తారమైనదండును వడిగ సమకూర్పవలయు. కదనభూమికి వేగమే పైనమై రావలయు. శుభముహూర్తకాలములందు ప్రతిగ్రామము నందును పల్లెయందును, పట్టణమందును భేరీనికరము పెద్దదమాయిలను సకలజనములకు దెలియునట్లు మోగింప వలయు.

3

అంత సేన లాయత్తములయ్యెను. ఒక శుభ ముహూర్తమున విష్ణువర్ధనుడు తనయగ్రసుతుడు విజయాదిత్యునకు యువరాజపట్టబంధము గట్టి బలమైనదండు నిచ్చి, కృష్ణరాజు నెదుర్కొన పడుమటిదెశకు బంపెను. పాండురంగప్రభునికుమారుడు నిరవద్యధవళునకు నఖిలసేనాధిపత్య మొసగి మల్లరాజును దునుమ దక్షిణమునకు బంపెను. వినయడిశర్మపుత్రుడు స్వామిశర్మను కళింగ కోసలాధిపులను ఎదిరింప నియోగించి ఈశాన్యమునకు బంపెను ప్రకటశౌర్యమూర్తులు, వీరాగ్రగణ్యులునగువారిని, విశ్వాసపాత్రులైనవారిని దండనాయకులుగా నియమించి, వారికి ప్రభువుగా తనరెండవ కుమారుని ఇఱుమర్తిగండనికి పట్టముగట్టి రాజధానిని సంరక్షింప నియమించెను. మిగిలిన మన్నెనాయకులను, దొరలను, పడవాళ్లను, సేనలను, తనమూలబలములుగా నుంచుకొని రాజధాని వీడివచ్చి, చాళుక్యభీముడు అప్రమత్తుడై దేశక్షేమ మఱయుచుండెను.

అచిరకాలముననొక్కపెట్టున దేశమంతయు మహాసంగ్రామక్షేత్రమయ్యెను. ఒకయేడు గడిచెను. రెండవయేడుగూడ గడచెను. మూడవయేడు సగము సాగిపోయెను. నేలయీని యొసగుచున్నట్లు, ఎప్పటికప్పుడు బలములు తరుగు లేకుండ నెక్కడనుండియో సాగివచ్చుచుండెను. ఎడతెగనిమూకయుద్ధములకతన దేశము కలగుండువడియెను. సంగరసంక్షోభము పెల్లుగానుండుటచేత, చోరులు లభివృద్ధినొందిరి. కాటకములు ప్రబలెను. పంటలు లేకపోయెను. అంటురోగములు చెలరేగి వ్యాపించెను. శాత్రవబలములు నడచినమార్గములందు బావులు, చెఱువులు, గుంటలు, ఏళ్లు, అన్నియు విషప్రయోగమున నిష్ప్రయోజనములయ్యెను. మహాగ్రామములు ఒకదానివెనుక నింకొకటి, అగ్నిదేవుని కాహుతియయ్యెను. ప్రజకు నిలువనీడయు, కడుపునకూడును కఱవయ్యెను. దురదృష్టవంతులైన ప్రజలు దిక్కుగలిగియు దిక్కుమాలిపోయిరి.

౧ మొగలిచెఱువు చెంత యువరాజు విజయాదిత్యుడు కృష్ణరాజు బలముల నెదరించి పూర్ణముగ నోడించెను. కాని యతడు సుడివాలు౨ పోటునకు మిక్కుటముగ గాయపడి, చావుబ్రతుకులనడుమనుండి యాహవరంగమును విడిచిపోయెను. అందువలన ఆతని మహావిజయము నిరుపయోగమైపోయెను. దక్షిణమునందును నైఋతియందును జయాపజయములు ఒక్కతీరుగా నుండెను. తుదకు మల్లరాజ, కృష్ణవల్లభుల రెండుసేన లేకమై నిరవద్యధవళుని సేనను శ్రీపర్వతము చెంత మార్కొని ఖండించివైచెను. శాత్రవబలమంతట రాజధానినిగూడ నాక్రమించుకొనెను. మూడుమాసముల లహోరాత్రములు శరవర్షము గురియుచుండ ఇఱుమర్తిగండడు రాజధానిని సంరక్షించెను. కాని దైవసహాయము లేకపోయెను. కోట వెలువడివచ్చి వల్లభదండనాయకులను ప్రతిఘటించి పోరుసల్పెను. చివరకు విజయము కనుమూపు మేఱలో నున్నసమయమున, పెదవంగూరు3 యుద్ధమున, నిస్సహాయుడై, అభిమన్యుకుమారునివలె దుర్మరణము నొందెను. అంతయు ముగిసినవెనుక విజయలక్ష్మి యాతని మృతకళేబరమును పరిరంభింప వచ్చెను. అప్పటగూడ జయము నిష్ప్రయోజనమయ్యెను.

౧ ఇది ఓరుగల్లునకు సమీపమున నున్నది.

౨ ఇది యొకవిధమైన చక్రాయుధము.

3 ఏలూరునకు సమీపమున గలదు.

దేశమంతయు శత్రువుల కైవసమయ్యెను. ఆంధ్ర సైన్యములు చెల్లాచెదరైపోయెను. చాళుక్యభీమునకు, పుత్రవియోగదుఃఖము దుర్భరము కాలేదు. పదచ్యుతు డగుదునని భీతికలుగలేదు. తన ప్రాణముకన్న, తన రాజ్యముకన్న, తనసుతులకన్న నధిక ప్రియతము లైన ప్రజలు, పడుచున్న అగచాట్లను చూచి యా రాజచంద్రుడు సహింపలేకపోయెను. సర్వలోకాశ్రయు డన్న తనబిరుదము దబ్బఱయైనదని యాతడు పరితపించెను. ఆతడు నిద్రాహారములు మానివైచెను. మృదు హంసతూలికాతల్పముపై పవ్వళించు సుకుమార మోహనాకారుడు ఆదినములలో అహోరాత్రములు సైనికులతోపాటు చాపకూడు భుజించుచు, వట్టి నేలను చాప పఱచుకొని శయనించెను. అప్పుడతని కొక్కటియే చింత. శాత్రవబలములను నిర్మూలనము గావింపవలయును. రాజ్యలక్ష్మిని మరల వశముచేసుకొని ప్రజను సుఖముగా బాలింపవలయును. కాని అడుగడుగునకు జగడము. ఎచ్చటచూచినను పరాజయమే! ఎచ్చటగాంచినను ద్రోహులే! ఎటు నడచినను శత్రుసేవలే! సుందరమై మహోన్నతమైన యాతని మంగళగాత్రము కుపోషకోపవాసములచే శస్త్రాస్త్రఘాతములచే కృశించెను. విష్ణువర్ధను డానాడు ఏకకళామాత్రుడై జీవము గడపినాడు. కాని యా రాజచంద్రునికి ఉత్సాహ ప్రభు మంత్రశక్తులు సన్నగిల్లలేదు. ధైర్యసాహసముల నాతడు విడనాడలేదు

ఇంతలో వర్షకాల మేతెంచెను. కృష్ణాగౌతములు పొంగి పొరలిపోవుచుండెను. ఇరుపార్శ్వముల నుండి వేంగిమండలమునకు రాకపోకలు దుస్సాధ్యములయ్యెను. సైన్యములను మరల గూర్చుకొని రణరంగమును ప్రవేశించువఱకు భీమనృపాలు డెందేని యొక దుర్గమదుర్గమందు తలదాచుకొనదలచెను. చెంతనున్న కొలనుపుర మాతని కాకష్టకాలమున ఆశ్రయమిచ్చెను. రహస్యముగ నాతడందు ప్రవేశించెను.

కృష్ణవల్లభుని సేనానులలో బద్దరాజు కడునుద్దండుడు. ఆతడు ముదిగొండపురాధీశ్వరుడు. చాళుక్య భీమునకు నాతడు తొలుత సామంతుడయ్యెను, కొండొక కారణమున ద్రోహియై రాష్ట్రకూటవల్లభుని నాశ్రయించెను. ఆంధ్రదేశాధీశ్వరుని రహస్యములను, ఒక టొకటిగా కృష్ణరాజునకు వెలిపుచ్చెను. బద్దరాజునకు భీము డెచ్చట దాగెనో ద్రోహులైనకొందఱు రాజపురుషులవలన రూఢిగా తెలియవచ్చెను. అతడప్పుడు మల్లరాజుచెంతకు జని, "భీముని జంపి, యాతనిశిరము దెత్తును, ఏమి మొసగెదవో బహూకరింతు" వని బేరమాడెను. భీముని యుత్తమాంగమును గొనివచ్చినవానిని "దక్షిణాంధ్ర మండలమునకు అధ్యక్షునిచేసి, కటకాధిపత్యము నిత్తు" నని మల్లరాజు వాగ్దానమిచ్చెను. పాకనాటికి ప్రభువు అగుదునన్న అడియాసతో బద్దరాజు ఉత్సాహోదగ్రుడై పెద్దదండుతో పైనమై వచ్చి, కొలనుపురమును దుర్భేద్యముగ ముట్టడించెను.

కొలనుపురము, కొల్లేటియొడ్డుననుండిన నొక మహాభీకరమైన దుర్గము. అది మండువేసవియందు స్థలదుర్గ మనిపించుకొనును. నిండు వర్షఋతువునందు జొరఅశక్యముగాని జలదుర్గమై అలరారుచుండును. ఆదుర్గ మిప్పుడు కానరాదు. శిథిలమై, సంపూర్ణముగ కాలగర్భమున జీర్ణమైపోయినది. ఏడునిలువులలోతును, నూటయిరువదిరాజహస్తములు వెడల్పును, మూడుక్రోసులు చుట్టుకొలతయు గల్గిన అగడ్త, బలిష్ఠమగు నాదుర్గమును కాలసర్పమువలె చుట్టియుండెను. అందు మృత్యుదేవతకు భృత్యులనదగు, ముదుసలి మొసళ్లు అనుగున కొకటి చొప్పున వేలకొలది యుండెను. కోటగోడలు దట్టములై, ఆకసము నంటుచున్నట్లు నలువదిరాజహస్తముల ఎత్తునకు లేచియుండెను. పుంజీభవించిన భువనగోళములవంటి గవనులు, రెండువైపులందును పెనుకంచుతలుపులతో, గోపురద్వారములతో, భీకరములయిన వంకదారులతో శోభిల్లుచుండెను. కోటచుట్టుగల బయలు వెలిపాళెములవఱకు భీషణములయి, అడుగిడుటకు సయితము శక్యముగాని మాయదారులతో నిండియుండెను. అందు కొన్నిదారులు లోతుతెలియని ఊబిలోనికి తటాలున దింపును. కొన్నిదారులు శరములు, ఖడ్గములు, కుంతములు, బాకులు, కటారులు, సురియలు, పరిఘలు మున్నగు నాయుధములు, నిలు

వుగా, నడ్డముగా, వంకరగా, పాతిపెట్టబడిన లోతు తెలియని మాయగోతులలోనికి పడద్రోయును. అట్టి వనేకము లాకోటచుట్టును గలవు. త్రోవ తెలిసినవారి సహాయము లేకున్న నాప్రాంతమున నడుగు పెట్టుట మిక్కిలి సాహసము. ఆకారణమున నాదుర్గము శత్రువుల కసాధ్యమై యుండెను.

ముట్టడిప్రారంభమై యప్పటికే మూడుమాసములు గతించెను. తానట్లు క్రూరముగ చెఱవెట్టబడుదునని భీమ నృపాలుడు కలనైన తలపలేదు ఇపుడు లోపలనుండిన యాహారపదార్థములు, నిండుకొనవచ్చెను. బయటనుండి లోపలకు గ్రుక్కెడు నీళ్లుగాని, పట్టెడుతృణకణములు గాని లోనికివచ్చుమార్గము లేకుండబోయెను. నానాటికి శత్రువులు బలవంతులయిరి. భీమనృపాలుని సేనకు ధైర్య కంచుకము సడలునట్లయ్యెను. అట్లే యింకను మరి యొకమాసము చెఱబడి యుండినయెడల నిష్కారణ దుర్మరణమో పరాజయమో నిశ్చయమని విష్ణువర్ధనునికి గోచరించెను. తనసేనకు శౌర్యోత్సాహశక్తులు అంత రించకముందు, బద్దెరాజు బలముతో సాహసించి తలపడి దైవబలముండిన జయమో లేదేని చచ్చి వీరస్వర్గమో గొనవలయునని యాతని కపుడు నిశ్చయము దోచెను.

తనకై తమసర్వస్వమును సంతోషముగ త్యాగము చేసి, బ్రతుకుపై నాసవీడి, సమరమునకు సంసిద్ధులై యున్న పడవాళ్లను, మన్నెనాయకులను, సేనాసమూహమును, సేనాపతి, మహాసామంతామాత్యపురోహితాది ఆప్తమంత్రివర్గమును, చాళుక్యభీముడు తనసముఖమునకు రాబనిచెను. వారెల్లరు కొలువుకూటమునం దుచితాసనములం దుండి, బలిసి కొలువుండిరి. అపుడు వారిదెస పరికించి యారాజపుంగవుడు పరివేష్టించిన వీరకదంబకముమ వారివారి నియోగముల ననుసరించి యుద్దేశించుచు, నందఱకిని యథోచితములైన సంజ్ఞలు, అడియాలములును గల్గించి సన్మానించెను. పిదప సకల సేనాసమూహము సంగరాటోపమున నుండుట గాంచి సుహృష్టుడై, ఎల్లవారలకురణోత్సాహము విస్తరించి, రోషము ఘనీభవించి సాహసము వెల్లివిరియుటకునై, మృదు మధురగంభీరభాషణముల నిట్లని ఆనతిచ్చెను.

"ఓహోరణశూరులైన యోధవరులారా, అన్నలారా! మీకెల్లరకును శుభములు కలుగుగాక! సంతతరణోత్సాహులైన, బ్రాహ్మణవీరపుంగవులారా! మీకెల్లరకును సేమమగుగాక. మీకందఱకును మీబంధువులకును, మీకులస్వాములకును మారాజచాళుక్యవంశముపై గల భక్తిస్నేహవిశ్వాసములు, మద్రాజ్యసంరక్షణమందు మీకు గల నిరంతరసేవానురక్తియు, తరతరములనుండి మావంశకళ్యాణాభ్యుదయమునకు మూలకందము లగుచున్నవి. అక్కారణమున నేమును మత్కులమువా రెల్లరమును మీకు సర్వదా కృతజ్ఞులము!

"నేడు మార్గశిర్ష శుద్ధదశమి. ఎల్లి యేకాదశి. మహాపర్వదినము. అల్లదే పరికింపుండు! కోటకావల బద్దెరాజు విస్తారమైనదండుతో నిష్కారణముగ మనలను బంధించుచున్నవాండు. ద్రోహియై యాతండు మాకులవైరుల నాశ్రయించి మనలనుపీడించుచున్నవాండు. మనపటువిక్రమసాహసములను నేటికి మూడుమాసముల నుండి బధించినాండు. మనకిపుడు పరీక్షాసమయమే తెంచెను.

"మీరును, మీకులమువారెల్లరు శతానేకసమర సంఘట్టములందు భీకరశౌర్యమూర్తులై విక్రమించి, పటుసాహసమున మాకు విజయలక్ష్మిని బలిమిమైగొన్న వారు! అట్టి ఆంధ్రమహావీరపురుషసంతతి మీరు! పరమహీపాలపరాజయోత్పాదనమైన మీపరాక్రమమునకు నిష్కారణముగ నపచారము కలుగబోరాదు! మనశాత్రవులు యుద్ధసన్నద్ధులై వెడలివచ్చి విడిసియున్నారు. మన మింక నలసింపజనదు! మనమును ప్రతిరణము సేయవలయు. మీమీ హస్తములందు మాకు విజయసాధనములై మెఱయుచున్న భీకర, శార్ఙ్గ, ఖడ్గ, కోదండ, కుంత, చక్రాయుధములదీప్తులు మాకు విజయాభ్యుదయములను పరంపరగ ప్రాప్తింపజేయు గాక!

"పగదీర్చుకొనుటకు బవరంబుసేయ పొడి మీకు; భయదోగ్ర సంభూత పటురోషవహ్నితో పరబలము నఖిలమును భస్మీపటలము జేయుడు. లెండు, పయనము గండు. ఈ దారుణరణమందు జయముగొని ధరణీరాజ్య

మును వడసెదమొండు! లేదేని శాశ్వత నాకలోకనివాసమును గనియెదమొండు.

“ఈరాత్రియే సంబరముతో కదనస్థలికి కదలిపోవలయు. వీరాగ్రగణ్యులై వెలసినమీకు బోధింపవచ్చెను శూరధర్మంబు నేను. కదనవిక్రమముల కలనికి గదలుడు మీరు!”

చేత భైరవఖడ్గముఁబూని మొగము రోషముతో జేవురించి భీకరాకృతినొంద, అట్టహాసముతో దట్టించి పలికిన భీమనృపాలుని మాటలు, అఖిలసేనాసమూహమునకును రణోత్సాహము పెల్లుబ్బజేసెను. “మీపాదభక్తులమైన మాయందు శౌర్యంబు చావలేదు. శత్రువులపైబడి, తెగటార్చి మాస్వామివౌ నీఋణము దీర్చుకొందుము! సుస్థిరవిజయంబు సమకూర్చుదుము నీకు! వినవయ్యా మా ప్రతిన సర్వలోకాశ్రయుండ! మము జూడు, మా శౌర్యపటిమ జూడు! పగబూని, బద్దెరాజు క్రొవ్వణగించి, విడువక వానిబలమెల్ల జంపగాగలము! ఇత్తుము మేమెల్ల నీకొఱకు మా ప్రాణములను! నీపాదములాన! నీకులదైవతము నాన!” అనుచు పౌరుషోత్సాహములు ముప్పిరిగొన, వీరులందఱు పెక్కుపంతములాడిరి.

ఆంధ్రోర్వీపతి నాడుపల్కిన వీరవాక్యములకు ఆంధ్రవీరుల రక్తనాళములు, ఉబ్బి పొంగిపోయెను. తనువు కాలము నాటితో గడచిపోయెననుచు, ధరణీశు సముఖమున వీరులు నాయకులందఱు వివరముగా విందులు భుజియించిరి. తఱుచు రక్తమునతడిసినయట్టి జందెములను బిరుదుగా ధరియించిరి. రక్తగంధము నలదుకొని రక్తమాల్యములు ధరియించిరి. కయ్యమునకు గావలసిన సన్నాహములు చేసిరి.

ఆనాటిరేయి, ఎందుబోయినను పరువైనమా పేరు కల్లచేయమని వీరాలాపములు వినబడెను. ఎల్లి మాకు మరణమో, విజయమో అనుచు సంగరాటోపమే కనబడెను. “అలుగులదీప్తికి అలుగక పోరు సల్పుదుము; శరములదీప్తికి జడియక పగవారిలో జేరి యిట్లు దునిమెదము.” “సందడిరణమున శంకనొందక మా ఖడ్గహతులకు పరబలముల గూల్చివైచెదము” “శాత్రవవీరులు చుట్టుముట్టిన, భంగము నొందక బహుతరనైపుణ్యపటిమ ఇట్లు బవరంబు సేయుదుము” “మగబిరుదు జాఱిన మాకు నపకీర్తిగాదె!” అను ధీరవచనములు, ప్రతినలు, అట్టహాసములు అందందు సేనాసమూహమునందు గానవయ్యెను. ఆ బవరంపు పెండ్లికొడుకుల చూచిన అపుడాంధ్రోర్వీశునకు మేన పులకలు జనించెను. ఆతడును సమరైకదీక్షాపరుడై భీషణప్రతిజ్ఞబూని, తనకులదైవతము, తనపేరింటివాడు, దక్షవాటి భీమనాయకుని పూజించుచు, మహాశస్త్రాస్త్రముల నుపాసించె.

౪

పరీధావి గడచిపోయెను, ప్రమాదిసంవత్సరము గతించెను. ఆనందకూడ నడచిపోవచ్చెను. మూడేండ్లు అహోరాత్రములు తనయిలయేలిక నొక్కతీరుగ నగచాట్లు పడుచుండుట, తపోనిష్ఠాగరిష్ఠుడైయున్న రంగాధికక్కశర్మ చిత్తవృత్తి నెవంతయు చలింపజేయలేదు. అట్లుండ మార్గశీర్షము ప్రవేశించెను. అపుడాతడు కృత్తివాసునిపూజయందు దీక్షనించుక విరమించెను. ఆనాడు శుద్ధతృతీయతిథి. ఆరాత్రి లేతవెన్నెలకిరణముల కాంతియందు, భుజించి సుఖోపవిష్టుడైయున్న భర్తను తిలకించి, రంగశర్మయిల్లాలు, ఇంచుక కంటతడిపెట్టుచు “ఎఱుగనే యెఱుగరు గాబోలు! మీ ముద్దుల మఱఁది మాధవచమూపతి బిక్కనప్రోలు రణరంగమున, సందడియుద్ధమున బల్లెపుపోటునకు ఒఱ్ఱిగినగతి? మగకాసెకట్టి, కత్తిని చేబూనినందులకు ప్రభుఋణము దీర్చుకొని, సత్కీర్తి గనినాండు. దేశమునకై ప్రాణములర్పించి ధన్యుడైనాండు. కాని నాకుమాత్రము తోడబుట్టువు........కఱవయినాండు” అనుచు గద్గదిక నొందెను.

ఆపలుకులకు రంగశర్మ నిశ్చేష్టుడయ్యెను. సహజముగ నతిధీరమైన యాతనిహృదయ మపుడు కరగి నీరయ్యెను. ప్రయత్నము సలిపి; ప్రియురాలిదుఃఖము నుపశమింపజేయలేక పోయెను. ఒకించెసేపు ఆతరుణి యట్లు దుఃఖాశ్రువులురాల్చి; “ఆర్యపుత్రులు ఎంత

తపోనిష్ఠాగరిష్ఠాత్ములైనను ఆపత్సమయమున ప్రియురాలి దుఃఖమును బంచుకొని కృపకలిగి యూరడింపజాలరు? పోనిండు. మీ తెలుంగనిఘర్మములు ఏమైనుండునె?" కులపత్ని యిట్లు పలికెనని కిన్క బూనకుండు. కుల మర్యాద పాటించియైన మీరు రాజసేవనుజేయునోల్లరు గాబోలు? పూజ్యులయిన మామగారి యూదేశమును వారికే యొప్పజెప్పితిరి? చాళుక్యభీమ భూపాలునకు వాటిల్లినయాపద అఖిలాంధ్రభూమికినిగాదో? మీ శౌర్యము, మీవిక్రమసాహసస్ఫూర్తి, మీ ఖడ్గకౌశలము, ప్రఖ్యాతములుగావె? మీ శస్త్రాస్త్రవివేకము, కరితురగాగమకౌశలము దేశకళ్యాణమునకు ప్రభుసేవకు వినియోగపడదేని సార్థకత యెందు వీనికి? రణరంగమున దుమికి పెడబొబ్బవెట్ట, పృథివీశులందఱు మీముందు భయమందిపాఱగలరు! కదనస్థలికి పయనముగండు. మీ తెలుంగని నీతిశాస్త్రములు లేవు. ప్రియసతి దుఃఖోపశమనమున కేమిలెండు. జననమరణములు జనులకు నిక్కము. పౌరుషాధికతగల్గి బ్రతుక టిదిలెస్స! మన రాజచంద్రునకు గులవైరమును దీర్ప గురుతరసాహసులు మీరు. మీ కులస్వామి ననుసరించి సన్మార్గమున జని ప్రభుఋణము దీర్చుకొనుండు. సర్వలోకాశ్రయుండు మీసాయమునకై ఎదుర్లు చూచుచుండు! పరికించిచూడ ప్రభువునకు సాయపడువారు మీరుదక్క ఒరులు లేరు. మీ పావనవంశమును వర్ధిల్లచేయ, మిముబోలియున్న ఆయువమ్మంతుండికందువొక్కండుజాలు. కదనభూమికై కడునడిగకదలుండిమీరు! అచ్చట జయమో, మరణమో కొనుండు. పదల్క్రియ నింట గూర్చుండ పనిలేదు. రణరంగమున శాత్రవవిజయము సమకూరుమీకు! భైరవ ఖడ్గము వడినిచ్చుమీకు జయము. అఖిలశుభములు గలిగి వర్ధిల్ల గలరు మీరని యుపశ్రుతి వినవచ్చుచున్నది. మీ సాహసస్ఫూర్తికి పరాక్రమమున వెఱచి శత్రుసైన్యములు చెదరిపోగలవు. లెండు. బవరంబుసేయ బైసంబుగండు, నామాటమన్నింపుండు" అనుచు వేయివిధముల ప్రాణవిభుని హెచ్చరించెను.

మహాపతివ్రత, వీరపత్ని, కులసతి పలికినభీషణ వాక్యములు రంగశర్మ నాపాదమస్తకమును కంపింపజేసెను. ఆతని మేన నొక్కసారి శ్రీ వీరరక్తము చిరురించెను. రాజసేవలకు రణమే సఖమని తోచెను. అంతట రోష మొక్కసారి అగ్నిజ్వాలవలె నెగసి యాతని దేహమును మహనీయ శౌర్యతేజముతో వెలిగింపజేసెను. సహజారుణములైన యాతని నేత్రాంచలము జ్యోతిర్మయములై తేజరిల్లెను

ఆతక్షణమాతడు కవచియై, కోదండియై, ఖడ్గియై రణోత్సాహియై హుంకరించి, అశ్వమారోహించి, శరవేగముతో నిలువెడలెను. సంగరాటోపముతో జనుదెంచి కులదేవతలకును, ఇష్టదైవమునకును సాష్టాంగముగ నమస్కరించి, లేచి విజయాభ్యుదయమునకై చిత్తమేకాగ్ర మొనరించి ధ్యానించెను పిదప నాతనికులసతి కడ సెలవుగైకొనెను. అంత రంగశర్మ కులపాలిక ప్రాణేశ్వరుని కెదురుగా నిలిచి, మేన రక్తగంధ మలది రక్తమాల్యమును కంఠమున వైచి, ఆయుధము గైకొని దీవించెను. పిదప కైవార మొనరించి "జయ" వెట్టెను.

రంగశర్మ ఆరీతిగా నిల్లువెడలి నాలుగహోరాత్రములు మార్గాయాసము నెఱుగక, కార్యభారమును దలచుకొనుచు, సంరంభముతో రాజధాని విజయవాడ జేరెంచెను. తండ్రితా తలనాటినుండి యాతని నెఱిగిన వృద్ధరాజసేవకు లెవ్వరును రంగశర్మకు గానరాలేదు ఎదురొక్క లీయ లేదు. రాజధాని యారీతి నుండుట జూచి యాతడు వెఱగందెను. రాజచాళుక్యభీముని సింహాసనముపై, వృద్ధుడు, ద్రోహి, కుటిలమతియు నగు మల్లరాజు అధిష్ఠించియుండెను.

బ్రాహ్మణవీరుని రాక నెఱిగింప, మల్లరాజు రోషించి యాతని "రయమున బంధింపుడు; పైబడి ఖండింపుడ"ని ఆనతియిచ్చెను. ఆవృత్తాంతము రంగశర్మకోపమును మరింత రగుల్కొల్పెను. తన్ను బట్టవలచి వచ్చిన క్షుద్రవీరసమూహముపై దుమికి సింహనాదము చేసి ప్రళయకాల భైరవునిభంగి నొక్కడుగూడ తప్పిపాఱిపోకుండ ఖండించి గూల్చివైచెను. ఆవార్త మల్లరాజునకు దెలియునంతలో నాపద వాటిల్లగలదని యెంచి, ముందుకార్యము నాలోచించుచు, విజయవాడ

యం దొకముహూర్తమైనను నిలువరాదని, ఆకలి దప్పులనైన దీక్ష్యకొనక, హుటాహుటి వేంగీపురమునకు బైనమయ్యెను.

రంగశర్మకు వేంగీపురమందు గూడ ఎఱిగినవా రెవ్వరును గానరాలేదు తనసహపాఠులు, చెలులు, చుట్టములు, మున్నగువారు, కొందఱు హతులైరనియు, కొందరు దేశమువీడి, పాఱిపోయిరనియు, కొందఱు రాజద్రోహులై చరియించిరనియు విని, దుఃఖించెను. ఆమహానగరమున నాతనికి ఎవ్వడుహితుడో, ఎవ్వడు పగవాడో, కూడ తెలియదయ్యెను. ఆ బ్రాహ్మణవీరుని గాంచి, కొందరు తమలో గుసగుస లాడుకొనుచు, దూరమునుండి చూడ్కులు నిగుడించుచు, పోయిరి. మరి కొందఱు భీతచిత్తులై సందుగొందులబడి వడిగ బోయిరి. మరికొంద రాతనిమార్గమును వైఖరియును దవ్వుదవ్వుల నుండి పరికించుచు అనుసంధించుచుండిరి. ఆతనికంతయును నతి విచిత్రముగను, సంశయాస్పదముగను దోచెను.

ఆనాడు నవమి ఆనాటిసాయంకాలమున నాతడు భీమతటాకముచెంత నొకచింతలతోపులో విశ్రమించెను. పైనగాయుచున్న వెన్నెల, దట్టముగా బెఱిగిన యా తోటలోనికి జొఱలేదు. అందంతయును గాఢాంధకారము. ఆతోపు అతిభీకరమై యుండెను. సంక్షుభిత చిత్తముతో నాతడు కర్తవ్యముదోపక సంతాపము నొందెను. ఆకలిదప్పు లాతని వీడిపోయెను. రెండుదినములనుండి యాతడు ఆహారనిద్రల నెఱుగడు. అశ్వము నొకచెట్టునకు గట్టి రంగశర్మ నేలపై మృగాజినమును బఱచుకొని ఆలోచనాప్రవాహమునందు కొట్టుకొని పోయెను.

అంతట దవ్వులందు వికృతమైనసందడియయ్యెను. కండ్లు విప్పాఱజేసి, లేచి నిలువబడి, భైరవఖడ్గమును చేబూని సందడివచ్చినదిక్కు మొగమై పరికించెను. ముహూర్తములు కొన్ని గడచెను. అంతయు నిశ్శబ్దమయ్యెను. రంగాధిశర్మ యెదుట వీరపురుషు డొకడు, కోరమీసములవాడు, భీకరాకారుడు, సాష్టాంగముగ బ్రణమిల్లి, లేచి, "భూదేవు లవధరింపవలయు! మీ వృత్తాంతమునంతయు మహామాండలిక ఎఱ్ఱియరట్టడి బంపినవేగులవాండ్రవలన నెఱిగిరి. ఎఱ్ఱియరట్టడి నాతవాడిసీమ కధిపతి. తా మెఱుగకపోరు. మంచి కొండ విషయాధిపతి. కుసుమాయుధుడు తనసోదరుడు రణదుర్జయుని, దండు సాయమిచ్చి మీకు సాహాయ్యము చేయ బంపెను. భీమనృపాలుని సేనలను మరల రణభూమికి నడిపింపసాహసముగల దక్షు డెవ్వడును ఈ వేంగియందు గానరాడు. సేనలకు వెన్నువిఱిగినట్లయ్యె. మీ వృత్తాంతమును దెలిసినదాదిగా మీరు సర్వసేనాధిపతులై రాజకార్యము నిర్వహింప సమర్థులని ఎఱ్ఱియరట్టడి సందేశమంపెను. నన్ను గుండయరట్టడియని మావారుపిలిచెదరు. రాజచాళుక్యభీముడు మెచ్చి నాకు వేంగివిషయాధిపత్యము నొసగెను. ఇదిగో మా తామ్రశాసనము. సంశయింపవలదు. మీ రానతిచ్చిన ఎనిమిది ఝాములోపల, ఏనూరుగజములు, నాలుగువేలవాజిగణము, ఇరువదివేలకాలిభటులు, శరములు, ఖడ్గములు, పరశువులు, బల్లెములు, బాకులు, కటారులు, విండ్లు వేలసంఖ్యలకొలదిగూర్చి, వేగమే రాగలరు. ఎల్లి ఈవేళకు కొవ్వలిగ్రామముచెంత, గుడిసానమ్మచెఱువు సమీపమున బయలునందు మాదండు విడిసి, మీరాకకై ఎదురుచూచుచుండుము. మమ్మనుగ్రహించి సేనాధిపత్యమును స్వీకరింపుండు. వెండియును విశేషము కలదు! ఎఱ్ఱియమాండలికుండు తనమూలబలములను గూర్చుకొని పూర్ణిమనాటికి కృష్ణకావలియొడ్డున అనంతునికొండదఱి విడిదిదిగియుండును. ఎల్లుండి విష్ణువర్ధనుడు బద్దెరాజుపై దలపడ సంకల్పించి నాండని వీడును, మన మీకాలను పురయుద్ధమున విజయులమై, రాజధానిని జేరుకొనగల్గిన, మనకు శాత్రవవిజయము సిద్ధము. ఇంద్రకీలాద్రియెక్కి, కార్తికేయుని గుడిగోపురముమీద కరదీప మెత్తి చూపగల్గిన, ఎఱ్ఱియమాండలికుండు, కృష్ణ దాటివచ్చి మన సేనతో గలియగలండు. అప్పుడీధరణీరాజ్యము మరల సర్వలోకాశ్రయునికి కైవసము కాగలదు." అని వినయముగ, గంభీరముగ, విశ్వాసము జనించునట్లు విన్నవించెను.

ఆతని ప్రసంగమునంతయు నాలకించి రంగశర్మ నల్దెసలు పరికించెను, కొండొకసేపు వెఱగంది మాటలాడక యూరకుండెను. ఆలోచనయందు మునిగిపోయెను.

"తమయాజ్ఞకై వేచియున్నాడను" అని మాండలికగుండయరట్టడి మరల విన్నవించెను.

"నన్ను మీవాండనని ఎట్లు గ్రహింపగలిగితివీవు? మోసపోవుటలేదుగద నన్నుగాంచి?" అని రంగశర్మ ప్రశ్నించెను.

"భూదేవులు మన్నింతురుగాక! అశనపురమున నైదుదినములపూర్వము తాము గుంజ దేవభట్టారకులింట నుండిన నాటివృత్తాంతముల నన్నిటిని తలంపునకు దెచ్చుకొనుండు. తామిపుడు విశ్వసింపవచ్చును. రాజభీముని ముద్ర యిదిగో పరికింపుండు." అనుచు మాండలికగుండయ వచించెను.

రంగశర్మ దీర్ఘనిశ్వాసమును విడిచి "లెస్స! మేలు! నన్నిపుడు వీడిపొమ్ము! ఏనిపుడు కొన్ని విషయములు యోచనచేయవలయు. ఎల్లి నీవుకోరినరీతి సైన్యాధిపత్యము నంగీకరింతును. దైవ మనుకూలించుగాక మన నృపాలునకు" అని శూన్యభావము తేటపడుదృష్టితో, శాంతముగ బలికెను.

మాండలికగుండయ మరల రంగశర్మకు సాష్టాంగముగ బ్రణమిల్లి, యొక్కట్రుటిలో మెఱుపువలె చీకటిలోనికి అంతర్ధానమయ్యెను. ఆరాత్రి రంగశర్మ నిద్దురబోలేదు. ఒకవంక చలి వడకించి గుమ్మడిమూట గట్టుచునుండగ, నా చిమ్మచీకటియందు, ఆతడల్లె కృష్ణాజినముపై నాసీనుడై ఆలోచనలందు నిమగ్నుడయ్యెను.

ఆనాడు మార్గశీర్ష శుద్ధదశమి. చంద్రోదయమయ్యెను. రంగశర్మ సేనాపతియై రణలక్ష్మి మూర్తిభవించినట్లున్న సేనాసమూహమును దిలకించి సుహృష్టుడయ్యెను. కాలరిపౌజులు బారులు దీర్చియుండ, పడవాళ్లు, దొరలు, నాయకులు ఖడ్గములతో, కైదువులతో, కటారులతో వినతు లొసగుచుండ పరికించెను. పొందికగా నమరినఅశ్వబలమును కలయగాంచి వీరరాహుత్తుల జోహారు లందుకొనెను. గుంపులుగాగూడిన గజసేనగాంచి, యా మదకుంజరములు నమస్కారసూచకముగా తుండములు పెకెత్తి ఘీంకృతులు చేయ సంతుష్టుడై తలపంకించి హుంకరించెను. పిదప నాయకవర్గమునకెల్ల, తగినట్టి కర్పూరతాంబూలములిచ్చి, శంఖతీర్థ మొసగి జయము గొనుడంచు ముదమందబలికెను. అంతట శుభముహూర్త మడిగి భేరీడమాయీలు పెల్లుగా మ్రోయింప నానతిచ్చెను. శాత్రవబలముల నెదుర్కొనుటకు నుపాయములను నాయకులకు పూసగ్రుచ్చినటులు దెలిపెను. దండునంతయు మూడుపాయలుచేసి మూడువైపులనుండి గదలుడని యానతిచ్చెను. సైన్యములు సంగరాటోపమున కదలువేళ పృథ్వీతలమెల్ల తల్లడమందెను. ముందు డమాయీలు, మురజలు, బూరలు, భేరీలు, కాహళములు, వంకిణీలు, కాలికొమ్ములు, శంఖములు, నరగలు, తప్పెటలు, రుంజలు మొదలగువాద్యములనాదములు విన్నవారికెల్ల వీనులు పగులునట్లుగ మ్రోగింపబడెను. ఆభీషణనాదము గగనంబునగప్పెను. దిశలు ప్రతిధ్వను లీనెను. మహాసైన్యము కదలి వడివడిగ కదలిపోయెను. అంతయు నొకక్షణములోపల మరల నిశ్శబ్దమయ్యెను. సేన లేదిక్కునకు నడచెనో ఎఱుగరాకుండ బోయెను.

కొలనుపురమున కోడికూతవేళ రణభేరి మ్రోగెను. వైతాళికులు సేనల కుత్సాహము కలిగించుటకు భైరవీరాగాదుల నాలాపించిరి. సంగీతము ముగిసినవెంటనే భేరీ, డమరుకాదిబహుతర భీకరవాద్యములు చెలరేగెను. బూరలు, కాహళములు, శంఖములు పూరించి సైనికులు భీషణారావములు చేసిరి. భటుల సింహనాదములు గావించుచుండ, మదకరులు ఘీంకారములు సలుపుచుండ అశ్వములహ్రేషలు నల్దెసలు వ్యాపించుచుండ, భీమనృపాలుడు సాహసముతర, కోటవెలువడివచ్చి, హుటాహుటి, నడిచి బద్దెరాజుసేనపై బడెను.

అప్పుడే వెలిపాళెముల చెంత రెండుపెద్దమూకలు సందడికయ్యమునకు దలపడినట్లు విష్ణువర్ధనుడు కాలరివలన నెఱిగి, యిష్టదైవ మనుగ్రహించినాడని ఆనందపరవశుడై "జయ! హరహర! మహేశా! అని వీ

రాట్టహాసముజేసెను. వీరుల కుత్సాహము గలుగునట్లు ధవళకాండమును తన భీషణశంఖమున వింతరీతుల పూరించి సాంద్రనాదము చేసెను.

ఒక్క మహూర్తము లోపల సందడిరణము ప్రారంభమయ్యెను. ప్రొద్దెక్కుకొలది పోరు భీకరతర మయ్యెను. ఆదారుణరణ క్రీడయందు ఘనతరోత్సాహులు కాలిమానుసులు అట్టహాసము చేయుచు చేత కరవాలములు, కటార్లు భిండివాలములు, సుడివాలములు గొని శత్రువీరులపై గదిసిరి. ఒకకాలు తెగినను హుంకరించి యెగిరి పోటుకారులైన పగఱమీదకు క్రోధావేశమున దుముకుచుండిరి. ప్రేగులు త్రెళ్లి బయటపడుచుండ నొకచేయి యెత్తిపట్టి రెండవచేత కుంతముఁబూని శత్రువులపై గవియుచుండిరి. ఒకతల తెగియును మహోగ్రులై తాము మున్నుగన్నిడినవారిని పొడిచి పడుచుండిరి. తెగిపడియును రోషము జేవురింప, క్రిందపెదవి గఱచి, బొమముడివైచి చెన్నుచెదరక శౌర్యమూర్తులై కూలుచుండిరి. సాహసముగల విలుకాండ్రు బాణములు, తూణీరములు, అలుగులు వేలసంఖ్యలకొలది బఱపుచు వర్షము గురియుంచుచుండిరి. ఏనుగులగుంపులను అశ్వసమూహములను, మానంతులు రేవంతులు బవరమునకు బురికొల్పుచుండ, తొండములు తెగియు, తలలు గూలియు నీల్గుచు, పెనువృక్షములు వాయుహతిని గూలినట్లు ఘూర్ణిల్లు శబ్దములతో నేలగూలుచుండెను. అందు వీరాగ్రగణ్యులు తమతమవాహనములు కత్తి వ్రేటులకు, కుంతప్రుపోటులకు చురికాగ్రఘాతములకు నేలగూలుచుండ, సాహసస్ఫూర్తి మెఱయ, సమీపవర్తులవాహనముల నధిరోహించుచు, నధికరోషముతో, పరిఘలు బూని పగవారిగుండియలు చీల్చుచుండిరి. తాము నొచ్చియు, నేఁదీర్చుకొనఁబోక, సడలిన నేస్తకాండ్రకు నడ్డుపడుచు పటిమతో పోరు సాగించుచుండిరి.

ఎచ్చట జూచినను పీనుగులపెంటలు, వరదలై పాఱురక్తప్రవాహములు. ఎందు గాంచబోయినను, బాధ కోర్వలేక నార్చుచు, బొబ్బలిడుచు తెగిపడిన పదాతులు, ప్రాణములు విడుచుచు ఘోరాకృతినున్న జంతువులు గుప్పతిప్పలై యుండెను. ముంజేతులు, వికావికలైన మొండెములు, బాహువులు, తొడలు, త్రెళ్లి వచ్చినశిరములు, ప్రేవులు మున్నగునవి ఖండఖండములుగా తెగిపడియుండెను. అట్టి వికటభీకరదృశ్యములతో భీషణారావములతో నొక్కపెట్టున ఘోరరణమయ్యెను.

అపరాహ్ణమయ్యెను గాని జయలక్ష్మియేరికిని వశముగాదయ్యెను. రణలక్ష్మివచ్చి యావేళమైనిల్చిన భంగి ఉభయబలములు పెనబొబ్బవెట్టుచు, ప్రకుపై నాసపాఱద్రోలి, పటువిక్రమాఢ్యులై బవరము సేసిరి. మూలదళముల గొనితెచ్చి, కుంజరసమూహమును పురిగొల్పి, సాహసముతో విక్రమించినగాని జయము కైవసముగాదని బద్దెరాజు నిశ్చయించెను. ఒక్క త్రుటిలో మూలబలములు దెచ్చి పురికొల్పి కాలరిమూకను యిరుపార్శ్వములనుండి భీమభూపతిదండును దాకవలయునని యానతిచ్చెను.

ఆసందడి సంగరకోలాహలమున, బద్దెరాజు దండనాయకులు గుఱ్ఱములపై నెక్కి, చుమికించుకొనుచు వచ్చి భీముని కదిసి చుట్టుముట్టాడిరి. ఆంధ్రోర్వీశు డపుడు భీకరసింహనాదము చేసి, దంతావళముపై నుండి ధనువు బూని శరపరంపరల బఱపి, శాత్రవసమూహమును చీకాకుపఱచెను. ఉభయనాయక వర్గముల యనుచరు లంతలో శత్రువీరుల వెన్నంటి పోరుచు ఘోరయుద్ధము జేసిరి. ఆసంకుల సమయమున పన్నిద్దఱువీరులు నొక్కపెట్టున భీమభూపాలుని ఎదిరించి, పెక్కువిధముల బొదివి, నేలగూల్ప దలపడిరి. ఆరాజశ్రేష్ఠు డపుడు రోషము ప్రకటించుచు, కాలాగ్ని రుద్రునివోలె, నార్చుచు శాత్రవబలమెల్ల తెగి కలతనొందు భంగి శరవర్షముల గురిపించుచు, రణకేళి సల్పెను. కాని అంతలో నొకడు ఛురికాగ్రమున భీమభూపతి భద్రగజమును డొంకెనపోటు పొడిచి, తుండమును ఖండించెను. వేరొకడు కుంభస్థలముపైకి కొదమసింగము మాడ్కి కుప్పించి ఎగిసి కుంతమును గ్రుచ్చెను. ఆవాడిపోటున నేగలేక నా భద్రగజము నేలగూలెను.

భీము డపుడు తటాలున నేలకు లంఘించి, పటు విక్రమముతో ఘోరభైరవఖడ్గముబూని, యవనాశ్వ మారోహించి, పై బడుచున్న రాహుత్తవర్గమును జంపి, సింగిణివిలుకాండ్రను, చిదుగఁగొట్టి, ఖడ్గఖేటకముల ఖండించి మించి, తనతనువున బాణములు శరములు, అలుగులు, బాకులు దాకకుండఁగ, నైపుణ్యముతో బాయఁ గొట్టుచు విచిత్రముగ సమరైకభైరవుడై పోరుసల్పెను. అట్లు కొంతసేపు సాగునప్పటికి దైవవశమున బాణమొక్కటి యాతనిగొమ్మున దూసికొని బాధించి నేల బడ ద్రోసెను.

అయాపత్సమయమునందు చాళుక్యభీముని యనుచరవీరుడు, గండరగండ డొకడు, భటసమూహముదెచ్చి, శత్రుసైన్యముపై జవ్వన గఱియ పురికొల్పి మనుజులలో మారిమసగినరీతి హుంకరించుచు యుద్ధము చేసెను. తనవారు పగవారిని కూలజేయుచునుండ "రణధూర్తులై వచ్చిన శత్రుచయమును గూల్పజాలని పౌరుష మది యేమిఫలము. ఆంధ్రవీరసంతతి మీరు. చాళుక్యరాజాన్నవర్ధిత రక్తముగాదె మీనరములందు పాఱునట్టిది, కలుషాత్ము డొకనిచే మనరాజు ఘాతనొంది మూర్ఛిల్లినాండు. నమ్మిన మీరాజును గావంగవలయు, రండోయి వీరఘనులార! పుణ్యాత్ములార!" అనుచు కదనస్థలమంతయు కంపించునటుల యెలుగెత్తియఱచెను.

అంతలో భీమభూపతి సేదదేరి, రక్తముపాఱకుండ కట్టుడిచేసి భీకరసింహనాదము జేసి పంతములు బలుకుచు వెన్నిచ్చి పాఱకుండ భటవర్గమును పురికొల్పెను. భీముడు చావలేడను వార్త శాత్రవవీచయమునకు రోషము కలిగించెను. అపుడు బద్దెరాజు వీరనాయకుల నల్గురైదురను సాయముగ గొనివచ్చి గండ్రగొడ్డండ్లతో, శూలములతో, సురియలతో గ్రుమ్మి, బాకుతో బొమ్మ పగులగొట్ట నుంకించెను.

అట్టి ఘోరవిపత్సమయమున రంగశర్మకు ఆంధ్రవీరునియార్తనాదము చెవిసోకెను. అపు డాతడు పటువిక్రమాఢ్యుడై కడుచోద్యముగ, శాత్రవరాహుత్తుల గుబ్బపుమొగ్గరమును జొచ్చి, ఖండించుచుండెను. ఎవ్వాని క్షేమమునకై తాను జపము తపమును మాని, సమరకార్యము జరుపఁదనుదెంచెనో, యట్టినమ్మినరాజు కూలనున్నాడని వినినంతనే, రంగాధిశర్మ గుఱ్ఱమును ఆదిక్కునకు దుమికించి యెగసెను. ఒక్కక్షణములోపల తన్నెదిరింపవచ్చిన రాహుత్తులశిరములు గొట్టుచు, బొమ్మలు గ్రుచ్చుచు, ముంజేతులు నఱకుచు భుజశౌర్యమొప్ప సైంధవవధవేళ విక్రమించిన విజయునివలె పఱతెంచి, భీమభూపతిని చీకాకుపఱచుచున్న శాత్రవసమూహమునందు గొండభేదించు పిడుగువలె నుఱికెను. బద్దెరాజు గండ్రగొడ్డలిబూని భీమునిశిరము తెగవేయ నుంకించుచుండ నలువంకలను వీరభటులు ఖడ్గకుంతములతో పొడువదలపడుచుండ, వ్రేటుపడిన కొదమసింహముమాడ్కి కనలి చిత్రగతి యుద్ధముచేయు నిజస్వామికి ఖడ్గసాహాయ్య మిచ్చెను. కనుఱెప్పపాటులో, రంగశర్మ ఖడ్గవీపులు మెఱసి బద్దెరాజును రెండుతునియలు చేసెను. పిదప కార్చిచ్చు భంగి కనలి కోపించి, మూగిన నాయకభటులనెల్ల ఖండించి వైచెను. ఏనుగు బలములను ఏనుగు, సరస్సును గలచివైచినట్లుకలగుండు పఱచెను.

బద్దెరాజుశిరము పైకెగసి కూలినపుడు రణధూర్తు డొకడు తనసామంతరాగోలకు దానిని గ్రుచ్చి పెకెత్తి వైరిబలములకు పిఱికితనము గలిగించెను. విఱిగి, పాఱుచున్నమూకలను నరికట్టి, మరల స్థిరముగా నిలిచి పోరాడ చేయగల్గు సత్తువు శాత్రవసమూహమునందు గానరాలేదు. రంగశర్మ యావేళ సైనికులకు ప్రోత్సాహము గలిగించుచు "మీకోరమీసకులు వడివేసి, మీ మగటిమిని ప్రకటించి ప్రాణములపై నాసవీడి బవరంబు సేయుండు; వీరఘనులు మీరు; ఘనపవిత్రులు మీరు; వీరపుంగవులై వెలయంగగలరు మీరు. సమరంబు సేయుండు." అనుచు వీరాలాపముల నాడుచు, ఘోరభైరవఖడ్గము బూని, వీరధైర్యమున ద్వాదశసూర్యులొక్కుమ్మడి ప్రబలినరీతి, చెలరేగెను.

* * * * *

ఒక్కముహూర్తమున మహాపజయముగా పరిణమింపవలసిన మహాసంగ్రామము, రంగాధిశర్మఖడ్గసాహా

య్యమున, అఖండవిజయమునుగా పరిణమించెను. కాలాగ్ని వలె నా బ్రాహ్మణయోధవీరుని పరాక్రమము నల్దెసలు వ్యాపించి వైరిబలములను భస్మీపటలము గావించివైచెను. వైరిసేనలు వెన్నువిఱిచి రణభూమిని వీడి పారిపోయిరి. శౌర్యలక్ష్మి, రణలక్ష్మి, జయలక్ష్మి ముగ్గురు నేకమై వచ్చి మరురూపు చెందినట్లు విక్రమించుచున్న రంగాధి కక్కశర్మను గాంచి చాళుక్యకులతిలకుడు అచ్చెరు వంది, సమ్మోదము నొందెను.

అప్పటికి సూర్యాస్తమయ మింకను కాలేదు. సమరాంగణము నాలుగుదిక్కులనుండి విజయసూచకమైన భేరి, మృదంగ, కాహళాది మంగళతూర్యనాదములు వినవయ్యెను. వైతాళికులు సంధ్యాసమయమేతెంచుచున్నదని దెలుపుటకును, పీనుగు పెంటలతో రక్తప్రవాహముతో, భూతపిశాచ బ్రహ్మరాక్షసుల కాకరమైన రణభూమి విడచి సైనికులు తమతమవారి నందరిని తోడ్కొని, స్కంధావారమును జేరవలయు నని దెలుపుటకు మంగళగీతములను గౌళిరాగాదులను మనోజ్ఞముగ బాడిరి.

౬

ఆనాటిసాయం సంధ్యాసమయమువేళ నాంధ్రక్షమాఖండలుని విజయస్కంధావారమునందు విజయసూచకమైన కోలాహలము వినబడుచుండెను. ఆ పృథ్వీశ్వరుని శిబిరప్రాంగణమున వివిధరాగరుచులచే నొప్పారుచుండిన పవనోద్ధూతవిజయపాలికేతనము ధ్వజముపై మంగళధ్వనులు వినవగుచుండెను. వేంగీశ్వరునివిజయము క్షణములోపల దిశాంతములవఱకు వ్యాపించిపోయెను.

వీరలక్ష్మీ విజలక్ష్ము సమాలింగితుడైన చాళుక్యచూడామణి మంగళగాత్రము రక్తసిక్తమై బిరుదుజండెములతో, కడుశోభతో వెలిగిపోయెను. అపరదిశాపురంధ్రి సర్వలోకాశ్రయుని మహావిజయమున కుప్పొంగిపోయెను. ఆ మంగళగాత్రుని ఆశీర్వదించుచున్నట్లు, సాంధ్యరాగముతో శోభనపుటారతి యెత్తి నీరాజనమిచ్చెను.

శతసహస్రానేకకరదీపముల కాంతియందు ఆ వెన్నెలరాత్రివేళ, వీరపుంగవులైన సామంతమహామాత్ర దండనాయక ప్రభృతులు సముచితాసనములందు పరివేష్టించియుండ, నాంధ్రక్ష్మాపాలుడు చక్కగా నమర్పబడి సింగారింపబడిన పెద్దగద్దెపై సుఖాసీనుడై కొలువు దీరెను. వెనుకను భటుడొకడు ముత్యాల వెల్లపట్టుగొడుగును, బంగారుగుబ్బతో వెలుగొందు దానిని వింతగా బట్టుకొనెను, వేత్రహస్తులు ముందు కటికధరులై సందడి సద్దుసేయుచు నిలువబడిరి. కులక్రమాగతములైన సామ్రాజ్యచిహ్నములు అందందు మనోహరముగ నెలకొల్పబడెను.

“ విష్ణువర్ధనమహారాజధిరాజు ! సర్వలోకాశ్రయుండ! చాళుక్యభీమభూపాల! ద్రోహార్జునాపరనామధేయ! జయీభవ! దిగ్విజయీభవ! దక్షవాటిభీమనాయక వరకటాక్షలబ్ధసుస్థిరైశ్వర్యవిభవామరేంద్ర! సమరైకవీర! అసహాయవిక్రముండ! విజయీభవ! దిగ్విజయీభవ! గొండళసాహసుండ! విక్రాన్తచక్రాయుధ! శశికుల పూర్ణిమాచంద్ర! చతురంగరామ! సాహసశూద్రక! భీమభూపాల! జయీభవ! దిగ్విజయీభవ! ” యనుచు బట్టువాడు బిరుదుగద్యలు పఠించెను. మహామాత్రుడు కనుసన్నచేయ, పరమభట్టారకుడు తనమనోభీష్టము దెలుపనుద్యుక్తుడై యున్నాడని యెల్లవారలకు దోచురీతి, వైతాళికు డొకడు వేదికముంగిట నిలచి కాహళమును బూరించెను.

చాళుక్యకులతిలకుడంతట కొలువు దిక్కు కృపావిశేషమున అపాంగదృష్టిని పరికించి యిట్లానతిచ్చెను.

“ పరమాప్తులైవచ్చి, పటువిక్రమాఢ్యులై మాకు సమరకార్యము దీర్చి సమ్మోదముగూర్చిన మీకందరకిని మా రాజపురుషులు సముచితరీతి సత్కారము లొసంగ గలరు ! మీకందఱకు నఖిలశుభములు, సౌఖ్యము లొడగూరుగాక ! వెండియు నాలకింపుడు సుహృష్టులమైన మా శ్రీచిత్తమును. అస్మత్కులకళ్యాణ పరంపరాభివృద్ధికై, అస్మద్దేశ సంతత్యాయురారోగ్యైశ్వరాభివృద్ధికై సమరము సేయవచ్చి, మాకు మహాపత్సమయము

నందు, ఖడ్గసహాయ మొనరించి, నిశ్శంకతో తనప్రాణమును మా ప్రాణసంరక్షణమునకై వినియోగపఱుప నేతెంచి, యేకవీరుడై ఖడ్గసహాయమాత్రమున శాత్రవ నిర్మూలనము గావించి బలిమివాటించి మాకు విజయలక్ష్మిని కైవసము జేసినయోధ వీరునికి వాజసనేయ బ్రహ్మవారికి, మాకాప్తుడగు విద్దశర్మచమూపతి ప్రియ తనయునకు, ఈ రంగాధికక్క శర్మకు మాకృతజ్ఞతా సూచకముగ, సమ్మోదముతో 'సాహసరక్కసాంక' అను బిరుదమును ఉష్ణీషమునకు గట్టి అలంకరించు వారము. మరియు నాయాజ్ఞ నాలకింపుడు. మాపితృవ్యులు ప్రేమతో నొసంగిన సీభిండివాలమును 'కృతాంత జిహ్వ' పేరుగలదానిని ప్రేమతో నిచ్చువారము. మా కొనర్చిన ఖడ్గసహాయ నిమిత్తమందు మేము మిక్కిలి సుహృష్టులమై, పాకనాటిసీమలోని పండిపాకగ్రామమును సర్వకరపరిహారముగ నగ్రహారము గావించి ఈ శుభముహూర్తమునం దుదకపూర్వముగ ధారవోయు వారము."

ఆపలుకులు ముగియునప్పటికి సంతోషస్వాంతులై విద్వాంసులు, బ్రాహ్మణవీరులు వేదమును బహుముఖములనండి జదువసాగిరి. పరమబ్రహ్మణ్యుడైన విష్ణువర్ధను డపుడు రంగశర్మకు కర్పూరతాంబూలమిచ్చి కస్తూరి యిచ్చి, ఖడ్గమిచ్చి, దివ్యాంబరభూషణాదు లిచ్చి యుష్ణీషమునకు వీరబిరుదుగట్టి, ఉదకపూర్వకముగ ప్రీతితో నగ్రహారము ధారవోసెను.

ప్రతిఫలమ పేక్షింపని యాకుమారబ్రాహ్మణవీరుని మేను, నిజస్వామిచేసిన మన్ననసత్కారములకు పులకించెను. ఆతని నేత్రాంచలములందు కృతజ్ఞతాసూచకమైన ఆనందబాష్పకణము తొలకాడెను. రంగశర్మ యపుడులేచి వినమ్రుడై, భక్తి, స్నేహ, సంభ్రమములు తొట్రుపడుచుండ తన యిలయేలికను వేదోక్తముగ, విజయ పరంపరాభివృద్ధిగ నాశీర్వదించెను.

ఆంధ్రక్షమాధీశ్వరుని యానందము పొంగి పొరలిపోయెను. ఆతని దివ్యకోమల హృదయము, లతయై తీగెలుసాగి, మరల పల్లవించి, పుష్పించి, ఫలములిచ్చెను. అపుడాతడు కృపాంగదృష్టిని రంగశర్మ నుద్దేశించి "భూదేవా! పరమాప్తుడవైన నీమేలు మరువదగినదిగాదు. అల్పవృత్తితో మొదట నొసంగినది మమ్ము ఋణవిముక్తులను జేయజాలదు. కావున పండిపాకతోపాటు సాష్టాధిక గ్రామములను మాన్యముగా ననుభవింపుము. ఏతద్విషయాధ్యక్షుడవై, మాకుప్రియభృత్యుడవై, పుత్రానుపౌత్రికముగ ఇష్ట సుఖోపభోగముల ననుభవింపుము." అని యానతిచ్చెను.

రంగశర్మ ప్రభువు పాదములపై మన్ననదృష్టి సారించి "మహాభాగ్య"మని, దీవనలిచ్చెను. అపుడతనికి, తన ప్రియురాలు, వీరపత్ని పలికిన ధీరవచనములు జ్ఞప్తికి వచ్చెను. పట్టరాని సంతోషమున నాతడు ఆంధ్రక్ష్మాపాలునకు దశలు మారు మ్రోతలిడునట్లు స్వస్తి ధావంతము ప్రతిధ్వను లీనునట్లు జయవెట్టెను. ఒక క్షణములోపల అఖిలశాస్త్రపారంగతులగు విద్వాంసుల ఆశీర్వాదఘోషలు, అన్నియుగూడ, వీరభటులు ఆనందాతిరేకమున జేసిన జయజయధ్వానములలో మునిగిపోయెను. దిశాంతములందుమాత్రము "విష్ణువర్ధనమహారాజాధిరాజ, రాజపరమేశ్వర! జయీభవ! దిగ్విజయీభవ!" అను జయశబ్దమే కట్టకడపట వినవచ్చెను.